క్లుప్తంగా

రక్తదానంతో ఆరోగ్యం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో ఉన్న శ్రీపాద డిగ్రీ కాలేజీ, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మేరకు గురువారం కాలేజీ సెమినార్ హాల్లో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సుగంధి, అరుణ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించి, అవగాహన కల్పించారు. కాలేజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయక హుండీ ఆదాయం రూ.14.75 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతంపేట: శ్రీసంపత్ వినాయక ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించారు. 21 రోజులకు రూ.14.75 లక్షల నగదు, 820 మిల్లీ గ్రామ్స్ బంగారం, 56 మిల్లీ గ్రామ్స్ వెండి, 108 యూఎస్ఏ డాలర్లు, రియాల్ 1, బంగ్లాదేశ్ డాకా 20, చెక్ రూ.111లు వచ్చినట్టు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.అన్నపూర్ణ తెలిపారు. శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీ లెక్కించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.ప్రసన్నలక్ష్మి, ఆలయ వ్యవస్థాపక సభ్యులు టి.ఆర్.చోలన్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతంపేట : దొండపర్తి సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రామా టాకీస్, పవ్వుల మార్కెట్, పౌర గ్రంథాలయం, లలితానగర్, ద్వారకానగర్ 3, 4, 5 లైన్లలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గైస్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలు సాధించారు. వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ తమిళనాడులో ఉద్యోగాల నియామకానికి సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఈ కాలేజీకి చెందిన 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. డిప్లమా ఇంజినీర్ ట్రైనీ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.3.25 లక్షలు, ట్రైనీ డిప్లమా టెక్నీషియన్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.2.50 లక్షలు వార్షిక ప్యాకేజీ ఇస్తారన్నారు. వీరిలో పెట్రో కెమికల్స్ నుంచి ఐదుగురు, కెమికల్ విభాగానికి చెందిన 15 మంది ఉద్యోగాలు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, విభాగాధిపతి డాక్టర్ ఎం.విజయలక్ష్మి, అసిస్టెంట్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కుమార్, కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఎ.దివాకర్ పాల్గొన్నారు.

రోడ్లపై వాకింగ్‌తో ప్రమాదాలు

మురళీనగర్ : రహదారుల్లో నడవడం ద్వారా కోరి ప్రమాదాలు తెచ్చుకోవద్దని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ''నడవండి – నడిపించండి'' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంతనే పచ్చని ఆరోగ్యకరమైన వాతావరణం కలిగిన పార్కులు అందుబాటులో ఉన్నప్పటికీ చాలా మంది రహదారులపై వాకింగ్ చేస్తున్నారని, దీని వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. క్లబ్ కార్యదర్శి చొల్లంగి ప్రసాద్ సహకారంతో వాకింగ్‌లో పాల్గొన్న వారికి ఉడకబెట్టిన గుడ్డు, అరటిపండు అందించారు. వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఉప్పలపాటి శుభ, చొల్లంగి ప్రసాదరావు, జి.వి జయలక్ష్మి, నానుపాత్రుని ప్రకాషరావు, రోణంకి నాగేశ్వరరావు, ఎల్‌వీ సుధాకర్ పాల్గొన్నారు.



రోడ్డు మధ్యలో గొయ్యి



విరిగిన రోడ్డు పక్కనే పలకలు అమర్చుకున్న స్థానికులు

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- 53వ వార్డులో రాకపోకలకు స్థానికులకు ఇబ్బందులు
- వాహనాలు స్కిడ్ అవ్వడంతో ప్రమాదాలు

మద్రిపాలెం : అసలే ఇరుకు రోడ్డు... ఆపై అడుగుకో గుంత... గజానికో గొయ్యి... ఇలా అయితే ఎలా ప్రయాణాలు సాగించేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఎటుచూసినా గుంతలు, గోతులు ఏర్పడడంతో రాకపోకలు సాగించలేకపోతున్నామని జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం శ్రీనివాస స్ట్రీట్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడిచేందుకు కూడా వీలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అటు ద్విచక్ర వాహనదారులు, ఇటు పాదచారులు వాపోతున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, ఇళ్ల ముందు కాలువలు ఉన్నాయి. ఈ మార్గంలో ఒక వాహనం వెళ్తే మరో వాహనం వెళ్లే వీలులేనంతగా గోతులు ఏర్పడినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మధ్యలో మ్యాన్‌హోల్స్, చుట్టూ విరిగిన రోడ్డుపై ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తమ ఇళ్ల ముందు విరిగిపోయిన పలకల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఆ రోడ్డంతా వీధి దీపాలు సరిగ్గా వెలగక కళావిహీనంగా మారుతుంది. చీకటిలో ఆ రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిత్తడిగా మారిన రోడ్లపై ప్రయాణించడానికి కాలనీవాసులు భయపడుతున్నారు. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల ముందు నుంచి కాలువల్లో చెత్త పేరుకుపోతోందని పలువురు చెబుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని శ్రీనివాస స్ట్రీట్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మ్యాన్ హోల్ పక్కనే విరిగిన రోడ్డు



శ్రీనివాస స్ట్రీట్‌లో మలుపు వద్ద గుంతలు

జ్ఞానజ్యోతి సమగ్ర శిక్ష తరగతుల పరిశీలన

మద్రిపాలెం : జీవీఎంసీ 50వ వార్డు మాధవధార ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, మహిళ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి సమగ్ర శిక్ష తరగతులను సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న తరగతులపై సీడీపీవో రమణకుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందుకు సంబంధించి పలు సూచనలు చేశారు. తొలి దశలోనే చిన్నారులకు విద్యలో బలమైన పునాది అందించడం ద్వారా పిల్లలు ఎంతో ఉత్తమంగా ఎదుగుతారని, విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యాక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

పరిశోధనలతోనే పలు అంశాలకు పరిష్కారం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

అల్లిపురం: అంటువ్యాధుల పరిష్కారమే లక్ష్యంగా విద్యార్థులు పరిశోధనలు చేయాలని, పరిశోధనలతో పలు అంశాలకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల అన్నారు. మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాశాల మీటింగ్ హాల్లో జరిగిన న్యూ ఫ్రాంటైస్ ఇన్ మైక్రోబయాల్ పేతాజిన్సిస్ అనే అంశంపై జరిగిన వర్క్‌షాపును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు వర్క్ షాప్ నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

మలేరియా బయాలజీ గ్రూపు లీడర్ డాక్టర్ పవన్ మల్హోత్రా, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జనీంద్రకుమార్ బాత్ర, ఐసీఎంఆర్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ఎ.రాజు బగాది, స్టాఫ్ సైంటిస్ట్ డాక్టర్ రూపేంద్ర కుమార్ విద్యార్థులకు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సబ్బవరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎ.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, మైక్రో బయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ టి.వరలక్ష్మి, డాక్టర్ లక్ష్మణ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు ఆక్రమించి వ్యాపారాల నిర్వహణ



రామలింగేశ్వరాలయం వద్ద బడ్డీ ముందు ఏర్పాటు చేసిన తోపుడుబండి



ఆక్రమణలతో ఇరుకుగా మారిన రామకృష్ణానగర్ రోడ్

సీతంపేట : పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న బడ్డీలు, తోపుడు బళ్లతో విశాలమైన రహదారులు ఇరుకుగా మారిపోతున్నాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ 26వ వార్డు రామలింగేశ్వరాలయం పక్క నుంచి రామకృష్ణానగర్‌కు వెళ్లే మార్గం బడ్డీలు, తోపుడుబళ్లు, టిఫిన్‌బళ్లు, పకోడీ బళ్లతో కుచించుకుపోయింది. దేవాలయం గోడ వెంబడి చాలా కాలంగా బడ్డీలు ఉన్నాయి. మరొక వైపు టిఫిన్ బళ్లు, అక్కడికి వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఇది చాలదన్నట్టు దేవాలయం గోడకు అనుకుని ఉన్న బడ్డీల ముందు కొత్తగా తోపుడు బండి ఏర్పాటు చేశారు. దీంతో రహదారి మరింత ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుకు అడ్డంగా తోపుడు బండి ఏర్పాటు చేసినా టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఆక్రమణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ మంత్రి అమర్‌నాథ్, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, బానాల శ్రీనివాసరావు



మాజీ సీఎం జగన్‌తో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

అధినేతతో మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పేడాడ రమణికుమారి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పీలా వెంకటలక్ష్మి

సీతంపేట/ కంచరపాలెం/మద్రిపాలెం : శ్రీకాకుళం పర్యటనలో భాగంగా విశాఖ ఎయిర్‌పోర్టులో ట్రాన్సిట్‌హాల్ట్ చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నగరానికి చెందిన పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్లమెంట్ మహిళా ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి కలిశారు. అదేవిధంగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందించారు. జీవీఎంసీ 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, పార్టీ విశాఖపట్నం మహిళా అధ్యక్షురాలుగా నియమితులైన పేడాడ రమణికుమారి మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసనలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

సీతంపేట : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక, కార్పొరేటర్ అనుకూల బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ప్రజా పోరు కార్యదర్శి దేవా పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 14 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచిన ఉపాధి హామీ పథకానికి సంబంధించి రూ.60 వేల కోట్ల బడ్జెట్‌లో కోత విధించారని, పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విద్య, వైద్య రంగాల్లో కూడా బడ్జెట్ బాగా తగ్గించారని ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బిహార్ రాష్ట్రానికి బడ్జెట్‌లో అనేక ప్రయోజనాలు కల్పించారన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆదాయపు పన్నులో మధ్య తరగతికి ప్రయోజనం కల్గిస్తున్నట్టు మోసపూరితంగా బడ్జెట్‌లో పొందుపర్చారని విమర్శించారు. కార్పొరేట్లు అదానీ, అంబానీలకు ప్రయోజనం కలిగేలా బడ్జెట్‌లో అనేక రాయితీలు కల్పించారని ఆరోపించారు. వికసిత్ భారత్ కోసం రూపొందించిన బడ్జెట్‌గా మోడీ వర్ణించడం పచ్చి మోసమని, ఈ బడ్జెట్ చీకటి భారత్‌ను నిర్మించేదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీ వల్ల తాత్కాలిక ఉపశమనమే తప్ప, సొంత గనులు కేటాయించకుండా ప్లాంట్‌కు పూర్వవైభవం సాధ్యం కాదన్నారు. కూటమి నేతలు, ఎంపీలకు దమ్ము లేదని, కేంద్రాన్ని నిలదీయలేకపోతున్నారని ఆరోపించారు. విభజన చట్టం ప్రకారం కడపకు ఉక్కు ఖర్మాగారాన్ని కేంద్రం ఇవ్వకపోవడం ఏపీని మోసగించడమే అన్నారు. కార్పొరేట్ కంపెనీలు బ్యాంకులకు బాకీ ఉన్న రూ.10 వేల కోట్ల అప్పులను మాఫీ చేశారని, తిరిగి బ్యాంకులు వారికి అప్పులు ఇచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. కార్పొరేట్లకు అనుగుణంగా రూపొందించిన బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి బి.గంగారావు, బి.పద్మ, కుమార్, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్యాలు అవసరం



పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

సీతంపేట : విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా ఇతర నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'కమింగ్ టుగెదర్ ఫర్ డిసెమినేషన్ ఆఫ్ నాలెడ్జ్' అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎవరైనా ఏ రంగంలోనైనా సక్సెస్ కావాలంటే ముందుగా వారు ఎంత కష్టపడటానికైనా సిద్ధంగా ఉండాలన్నారు. చివరి వరకు పోరాడుతూ ఉండాలని, మనలోని లోపాలను ఎవరైనా చెప్పినప్పుడు పాజిటివ్‌గా తీసుకుని బలహీనతలను సరిదిద్దుకుని విజయాలను అందుకోవాలని సూచించారు. సమాజంలో మార్పు కోరుకునే వారు ముందుగా తాము మారాలని, అప్పుడే మార్పు సాధ్యమన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణతోనే సమాజంలో మంచి మార్పు వస్తుందని తెలిపారు. ముందుగా గ్రంథాలయలయంలోని అన్ని విభాగాలను, పుస్తకాలను, ఉద్యోగార్థులకు కల్పించిన సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మియావాకీ చిన్న పిల్లల విభాగంలో కథకులు సీతా శ్రీనివాస్ పిల్లలకు కథ చెబుతున్న కార్యక్రమంలో భరత్ పాల్గొని అభినందించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, పౌరగ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ, కోశాధికారి కె.వి.గుప్త, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పురాతన భాష తమిళం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కారు నాగరాజన్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతంపేట : భారతీయ భాషా సమితి, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, కాసి తమిళ్ సంఘం సంయుక్తంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల తమిళ కళా మందిరంలో గురువారం 'మహర్షి అగస్త్య'పై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ తమిళనాడు ఉపాధ్యక్షుడు కారు నాగరాజన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగస్త్య మహర్షికి భగవాన్ శివుడు మొదటి భాషను నేర్పించారని, దానిని సరిగా వ్యాకరణం చేసి ప్రపంచానికి అందించారన్నారు. అందువల్ల సరైన సవరణలు, లోతైన అర్థాలతో కూడిన పురాతన భాషగా తమిళం పరిగణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎస్.ఎన్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడంతో కాన్సర్ మహమ్మరిని ముందుగా గుర్తించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ప్రోగ్రాం అధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడారు.

గత నెల 20 నుంచి ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ కమ్యూనికల్ డీసెజెస్ నివారణ కార్యక్రమం, జనాభా అధారిత స్క్రీనింగ్ ప్రోగ్రాం, మధుమేహం, అధిక రక్తపోటు, సాధారణ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలు విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదలకు ఏఐవైఎఫ్ డిమాండ్



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్

అల్లిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా మెగా డీఎస్సీ విడుదల చేయకపోవడంపై అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని మోసపూరిత హామీతో అధికారంలోకి వచ్చిందన్నారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి వై.రాంబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో పరిశ్రమలకు అనేక సౌకర్యాలు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు వేయడం లేదని ఆరోపించారు. ఉత్తరాంధ్ర యువత ఉపాధి అవకాశాలు లేక విదేశాలకు తరలి పోతున్నారని అన్నారు. కేంద్ర, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజు, వి.కన్నబాబు, బి.వాసు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.